ఆద్మీ ఫిల్మూ - ఆంధ్రదేశమూ

"ఆద్మీ చూశారా ?"

అన్నారు రామశాస్త్రిగారు. అప్పటికింకా ఆయన పేరూ, వూరూ ఏమీ తెలియవు. నే నెరిగిన రామశాస్త్రులకంటె నా ఆత్మ సన్నిహితులౌతారనే తెలీదు.

"ఎవరది ?"

"ప్రభాత్"

"శాంతారాం నాకు నచ్చే ఫిల్ము తియ్యలేడని నమ్మకం చాలా కాలం కిందనే కుదిరింది నాకు. శాంతా ఆప్టే వుందా?"

"హుబ్లికర్"

"ఏదోవాక శాంత" అన్నాను సినికల్‌గా.

"ఈ ఫిల్ము చూడండి. నేను పధ్నాలుగుసార్లు చూశాను. మళ్ళీ చూడాలని బెజవాడ వెడుతున్నాను. మీరూ చూడండి."

చూడడం పడదని తెలిసే 'ఊ' అన్నాను.

"ఏమిటి ఆ ఫిల్ములో గొప్ప ?" అన్నాడు అన్నీ తెలుసుకోవాలని ఆత్రుతపడే శిరోమణి.

ఆంధ్ర డాస్టవిస్కీ శిరోమణి కాదు. ఈయన యింకో శిరోమణి.

"ఆ ఫిల్ములో గొప్పకానిదేమిటో చెప్పలేను."

"కథ యేమిటి ?"

"పోలీసు జవానుకి వేశ్యకి జరిగిన ప్రేమగాథ."

వోడ్‌హౌస్ లిటిల్ Bachelorలో పోలీసు జవాను కవిత్వం నేర్చుకునే ప్రయత్నాలమీద తెప్పించిన నవ్వు జ్ఞాపకం వొచ్చింది, పోలీసు జవానుకి ప్రణయం అంటకట్టడం సాహసకార్యమే!

★ ★ ★

రుక్మిణీనాథశాస్త్రిగారు (ఇంత పేరు ప్రతిసారీ వ్రాయడం యిబ్బందిగా వుంది.) రాత్రి తొమ్మిదింటికే లేచారు, మాటల్లోంచి.

"సూరీ వాళ్ళూ సినిమాకు వెడతారట నా కోసం కాచుకొని వుంటారు."

"ఏ ఫిల్ముకి."

"ఆద్మీకి"

మళ్ళీ ఎదురయ్యిందా నాకు ?

పొద్దున్నే గేటుదగ్గిర్నించే తిట్టుకొంటో వొస్తున్నారు ఆయన.

"రాత్రి ఆయనకు బందరు రచయితలు ఎవరన్నా కనిపించలేదు కదా! లేక ఫిల్ములో దర్బారుసీను చూపారా?" అనుకున్నాను.

"ఆ ఫిల్ము : ఆద్మీట : కిక్కిరిసి వొచ్చారు చూడ్డానికని : బుద్ధిలేదు. న్యూథియేటర్సుని వెక్కిరించి సులభంగా ఖ్యాతి కొట్టెయ్యాలని గంతులేసాడు ఆ శాంతారాముడు" అని ఆగారు.

"—వెక్కిరించా ?"

"ఆ, మరేమిటి ?

ప్రేమకి ఆకులు

ప్రేమకి చెప్పులు

ప్రేమకి నీళ్ళు"

అంటాడు. "ప్రేమనగరికి పోవడానికి టిక్కెట్టుకి డబ్బు లేదట వాడి మొహం !"

నాకు సంతోషం వేసింది. ప్రేమజాఢ్యాన్నీ, అంతకన్న ప్రేమ అంటో పలవరించే నాల్గోటి కథకులకీ కవులకీ చాలా Health giving dose ఆరోగ్యకరమైన మాత్ర అనుకున్నాను.

"చాలా బావుందండీ ; అవసరమేమో ఆ వెక్కిరించడం"

"ఏమో ఆ ఫిల్ములో బావుండలేదు."

"అంతేనా ?"

"అంతేనేమిటి ? అసలుసంగతి వినండి. ఆ ఫిల్ములో తెలుగు పాడారు. అచ్చ ఆంధ్రం, ఆపాట మన-రాశాట్ట. అతనికి వుత్తరం రాస్తు న్నానుగా 'ఒక్క పాటరాశి ఫిల్ములో పెట్టి, ఫిల్మంతా దురదృష్టంతో తగల పెట్టావ"ని !

"అదా మీకోపం ?"

"నా కోపమేమిటి ? నా సరదా ! కథ సగంవరకు తీసికెళ్ళి ఏం చెయ్యాలో తోచక, గుటక కేసి, ఈ అయ్యనీ ఆ అయ్యనీ చెప్పమని ఆశ్రయించి, ఆ ముక్కతో, ఈ ముక్కతో, పూర్తిచేశాడు."

"అందరూ ఏమంటున్నారు ?"

"ఏ అందరు ?"

"షితో వొచ్చినవాళ్లు"

"వాళ్ళా....అందరికీ .... విశ్వనాథ సత్యనారాయణగారు కూడా వొచ్చారు. ఆయన్నికూడా పట్టుకున్నాను, Opinion చెప్పమని"

"ఏమన్నారు ?"

"ఆయనకి ఇష్టంకాక ఏంచేస్తుంది ?"

"ఏం ?"

"ప్రేమ కవుల్ని తిట్టారుగా ?"

రామశాస్త్రిగారుకాని కుటుంబరావుగారుకాని లేక బోయినారే అని దిగులుపడ్డాను. వాళ్ళ లేనిలోటు నేనే తీర్చాలి.

"ఒక మిత్రుడు ఆద్మీ ఫిల్ము పధ్యాలుగుసార్లు చూసి...."

"మూర్ఖుడు. ఆయన ఎవరో చెప్పకండి. అపాయాలు జరగ వొచ్చు."

"ఆయన చాలా మంచి అభిరుచులు గలవారు"

"ఆయన ఎందుకు ? ఈరాత్రి మీరు చూడరాదూ ! మీకే తెలుస్తుంది."

తలవూయించాను. చూడడం పడదని తెలిసే.

* ★ ★

బస్సులో వెనకసీటులో చీకట్లో యిద్దరు రసికులు (అసలు అర్థంలో, కామపరంగా కాదు.) తెల్లారికట్ట చలిలో వొణుకుతో వేడి కోసంగావును, మాట్లాడుకొంటున్నారు.

"రాత్రి వుండిపోయినాను, విశ్వనాథ సత్యనారాయణగారి ఉప న్యాసం వుందని విని, నే నెప్పుడూ ఆయన్ని చూడలేదు. ఆయన చాలా కరుకుమనిషి అన్నారు గాని, ఏమీకాదు....నాతో...."

"నేను మళ్ళీ పెళ్ళికి వెళ్ళాను. అసహ్యంగా వుంది."

"చాలా బావుంది. అట్లా అంటారేం?" అని అనవసరంగా అందు కున్నాడు, బస్సుకి దాహా లందిచ్చే కుర్రవాడు.

ఒకాయన నవ్వాడు.

"అభిప్రాయబేదం." అదే నిన్న ఉపన్యాసంలో విశ్వనాథ సత్య నారాయణగారు అన్నారు. 'మేము ఆద్మీ ఫిల్ముకి వెళ్ళాము. నా పక్కన కొందరు మిత్రులు చాలా అద్భుతంగా వుందని అంటున్నారు. కొందరు చీదరించుకుని ఉమ్మేస్తున్నారు. నన్నడిగారు, పిళ్ళూ వాళ్ళూ కూడా. యేం చెప్పను? ఎవరికి కోపం తెప్పించను?' అన్నాను అన్నారు సత్యనారాయణ గారు" అంటున్నారు బస్సు సహచరుడు.

సత్యనారాయణగారు కూడా కోపం తెప్పించడానికి జంకారా ? అని అనుమానించాను నేను

* * *

దీపావళి పత్రికలో ఆద్మీని ఘోరంగా విమర్శించారు. కారణాలు బలీయంగా కనపడ్డాయి. హరీన్ చటర్జీ సంగీతం విషయమై, నాతో, సౌతో, ఏకీభవించి, శాంతా ఆప్టేనీ, కర్ణాటక సంగీతాన్ని గంగలోకి నెట్టిన రామశాస్త్రీ యీ ఫిల్ముని పధ్నాలుగుసార్లు వూరికే చూస్తారా ? పై పైచ్చు ఆద్మీలో సంగీతం బావుందని మూర్ఛలు పోయారు.

మాస్టర్ కృష్ణా మళ్ళీ జన్మమెత్తికూడా నన్ను సంతోషపెట్టలేదని దృఢవిశ్వాసం నాకు. మరి రామశాస్త్రిని ఎట్లా టోపీవేశాడో! ఎప్పుడో కాని కనపడదేం రామశాస్త్రిగారు అడుగుదామంటే!

ఇన్నిరకాల నిశ్చితాభిప్రాయాలు ఒకే దేశంలో ఎక్కడ దొరుకుతాయి. యిన్నిరకాల డ్రెస్సులు, షోకులు, ఫాషన్లు, అభిరుచులు యీ తెలుగు దేశంలోగాక! జాతీయత అనే పేరుతో ఇంత వెరయిటీని dead uniformity కింద పూరుస్తారా? ఏ ప్రత్యేకతా వుండకూడదనే ప్రత్యేకత వుంది కదా? ఏది నచ్చితే అది, ఏ దేశంది ఏ కాలంది, ఏ మనిషిది, ఏదైనా అంగీకరిస్తామనే విశాలదృష్టి యింకెవరికి వుంది! ఇంతధిక్కారం, ఈ ప్రమాణ వైరుధ్యం, యింత నిర్లక్ష్యం, నిర్భయత్వం, అనాయకత్వం, అనధికారత్వం—"

* * *

షా, చే, "ఆద్మీని చూశాం" అని చెరో చెయ్యీ పట్టుకున్నారు.

ఎట్లావుంది అని ఆత్రుతతో అడిగాను సౌరీస్ని, సౌరిస్ చూస్తే నేను చూసినట్టే.

"చాలా బావుంది. సంగీతంతప్ప"

కొంచెం కుదుటపడ్డది నా గుండె, నేను దీపావళిలో చదివిన విషయాలు ఏకరువు పెట్టాను, వొప్పుకోడం ఇష్టం లేనట్టే ఆలోచించింది.

"అవునులే. నిజమే. కాని శాంతా హుబ్లీకర్ని నువ్వుచూసి తీరాలి." అంది.

"ఆ తల్లిని మాత్రం చంపెయ్యాలనిపించింది."

"అంతకన్నా తెలుగులో కథ చెప్పేవాణ్ణి చంపాలి" అంది 'చే'.

"ఆ తల్లి మన సుందరీబాయి. ఆమె వొక్కత్తే క్రిష్టాకి ఎదురు తిరిగి బాగా పాడింది" అంది షా.

చే, షా. చెరో కొననించీ ప్రపంచాన్ని చూశే వాళ్ళిద్దరూ, ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం లేనివాళ్ళు ఆద్మీ బావుందంటున్నారు.

గుంపులు గుంపులుగా నన్ను ప్రేమించే బెజవాడ ప్రజలు ఆద్మీని చూడ్డానికి వెళుతున్నారని విన్నప్పుడే అనుమానపడుతున్నాను. ఆద్మీ చాలా సాధారణ వ్యవహారమై వుండాలని, గాంధీగారి పాప్యులారిటీకూడా, ఆయన గొప్పతనంలో లోపాన్ని సూచిస్తుందని చాలా యేళ్ళు వాదించిన నేను.

"సాయంత్రం మళ్ళీ వెడతాం. నువ్వూరా" అన్నారు వాళ్ళు. సరే నన్నాను. వెళ్ళలేనని తెలిసికూడా.

అయినా శాంతారాం ఎట్లా మంచి ఫిల్మ్ తీస్తాడు ?

మర్నాడు సాయింత్రం మైదానంలో నేనూ, మిత్రులూ కలిసి ఆద్మీని చూసాము. దీపావళీ, రుక్మిణీ, నా ప్రెజుడిస్, ఒకవేపు; సొరిస్ రామశాస్త్రి ఒకవేపు పెట్టి.

"కుటుంబరావుగారు ఆద్మీని గురించి వ్రాశారు. చూశారా?" అన్నారు కాటేజ్ ఇన్‌డస్ట్రీస్‌గారు.

"లేదు. వ్రాశారా? మరి ఏ తక్కెడలో వేద్దాం!"

"దీపావళిలో"

వేశాం. వేశినా కదలలేదు ముల్లు.

కుటుంబరావుగారు వ్రాసింది చదవాలనిపించింది. సంగీతం రుచిలో ఎంతో యిద్దరమూ భేదించి, ఒకరి అభిరుచులమీద ఒకరం గౌరవం కల వాళ్ళం. నవ్యసాహిత్య పితామహుల విషయమై అభిప్రాయాలు వెలిబుచ్చ డానికి మాటలకోసం భాషలు తిరగేశాం.

* * *

వెల్లటూరుగారు యినికలో గట్టిగా చతికిలపడి, తాను పూనాలో

శాంతారాం పక్కనకూచుని ఆద్మీని చూశిన కథ చెప్పారు. ఆద్మీ, టెక్నిక్ చాలా గొప్పదనీ, రసం తక్కువఅనీ ఆయన అభిప్రాయం.

★ ★ ★

మూడువారాల కల వాస్తవమయింది. రుక్మిణిగార్నీ రామశాస్త్రి గార్నీ కలిపాను ఒకచోట. కాని పేర్లు తెలియజేస్తే ఆద్మీ క్వెశ్చన్‌మీద హత్యలు జరుగుతాయేమోనని జాగ్రత్తగా వూరుకొన్నాను. ఆద్మీ విషయం పైకి రాకముందే స్నేహితులైన, శ్రీ శ్రీ ఒక్కడే కవి, హృదయమున్న కవి, భవిష్యత్తుకు కవి. తక్కిన .... వీళ్ళందరూ ఎంత త్వరగా నశిస్తే, అంత సారస్వత కళ్యాణం జరుగుతుందని ఏకగ్రీవంగా యిద్దరూ తీర్మానాలు జరుపుకున్న తర్వాత రామశాస్త్రిగారు బైటకి వెళ్ళినప్పుడు వెళ్ళబెట్టాను.

"ఈయనేనా పదిహేనుసార్లు చూసింది?"

"ఇంకా అయిదుసార్లు-పైన ఈ మధ్య"

రామశాస్త్రిగారు రాగానే కొత్త మనిషిని చూశినట్టు ఎగాదిగా చూశి 'రుక్మిణి' గారు

"ఆద్మీ ఏం బావుంది?" అన్నారు.

మొదట ఆ ప్రశ్నకు తెల్లబోయి...."మీరేనా రుక్మిణీనాథ శాస్త్రి గారు.... ఆ....చాలా బావుంది. నిశ్చయంగా బావుంది. అమోఘంగా బావుంది. శ్రీశ్రీ కవిత్వంమల్లే బావుంది. వెధవ సమాసాల గణగణాలకి పోకండా చూసింది గట్టిగా సూటిగా చెప్పే బలమైన కవిత్వం లాగుంది."

అని రుక్మిణిగారి వాక్కుని శ్రీశ్రీ మంత్రంతో కట్టేశారు. కాని ఆద్మీ విషయంలో ఆ మంత్రానికి కూడా లొబడదలుచుకోలేదు రుక్మిణీనాథ గారు.

చివరకి in Spite of Admi మన స్నేహం అనశ్వరం, అప్రమేయం, అగాధం, అజేయం అని సమ్మతించుకున్నారు.

* * *

"అన్నట్టు ఆద్మీ చూశావా?" అన్నాను పద్మావతితో.

"చూశాను. బావుంది. ఆ శాంతాహుబ్లికర్‌ని మీరు చూడండి."

'వారూ' నవ్వుతోంది అప్పుడే.

తలెత్తి చూశాను. 'బుచ్చి' గొణుగుతున్నారు.

"మీ రెపుడూ అంతే...." అంటోంది పద్మావతి

"వాడి మొహం పోలీసువాడూ....ఆ సినిమా....ఆషూటింగూ.... నీకే, బావుండాలి."

అన్నమాటలు అక్కడక్కడ వినిపించాయి.

"ఏం వారూ?"

"ఏం బావుండలేదు. అట్లాంటి చెత్తఫిల్ములన్నీ అమ్మకి బావుంటాయి పెదనాన్నా"

నాకు interest పోయింది.

* * *

బోన్‌గిరిలో ఆద్మీ అనే తురకమాట వినేటప్పటికి "హైదరాబాదు వెడుతున్నారుగా ఆద్మీ అక్కడవుంటే చూడండి" అన్న రామశాస్త్రిగారి మాటలు జ్ఞాపకం వొచ్చాయి. విచిత్రం. నాతోనే ఆ రైల్లోనే దిగింది హైదరాబాదులో ఆద్మీకూడా. ఇక్కడకూడ ఈ ఫిల్ము నన్ను వదలదా? cauli flower మల్లే వెంటనే వొచ్చిందా ? ఎట్లా తప్పించుకోనూ ? ప్రారబ్ధం అనుభవించక తప్పుతుందా ?

ఆదివారందాకా తప్పించుకున్నాను. కర్మదేవతలు జన్మనక్షత్రాలు పరిశీలించి "ఆద్మీ ఫిల్ము అనుభవం తప్పదు." అని ఆకాశంనించి అరిచారు. వొస్తానన్న కృష్ణారావు రాలేదని తప్పించుకోవాలని చూశాను కాని ఆ కర్మదేవతలు జ్వరంతో పడుకున్న బాబుకి ఉష్ణం తగ్గించి 'నేను వొస్తాలే, పోనీ' అనిపించారు దోవలో "పోనీ.... ఆ Dorothy Lamor Picture కి పోదాము అన్నాను కొన ప్రాణంతో.

"సరే నన్నాడు బాబు"

అమ్మా! తప్పించుకున్నాను.

ఎదురుగా వొస్తున్నాడు మధురమూర్తి కృష్ణారావు. ఆద్మీ నాకు చూపించి శాంతారాంని తిట్టించకపోతే ఇంక టీ తాగనని శపథం పట్టిన కృష్ణారావు.

"టిక్కెట్లు దొరక" వన్నారు. మదమతో అదిలించాను నా వాహనాన్ని వెనక్కి తిరగమని. అని నా Olb horse కాదని మరిచిపోయి అర్ధంకాక సినిమా వరండాలోకి దూకింది ఆ వృద్ధ సైకిలురాజము.

"వెనక్కి పోదాం"

లాభంలేదు. ఖరీదైన టిక్కెట్లు దొరికించుకుంటున్నాడు కృష్ణా రావు. వెళ్ళాం. సీట్లు మూడు వొరసగా దొరకలేదు. వెళ్ళిపోదామన్నాను కాని ఎంతపట్టుదల లేకపోతే నాముందు హైదరాబాదు పోయిన సోదర కవుల ప్రేమాస్పదమైన నా మీది అపవాదులతో మనస్సు విరగక ఇంకా నన్ను ప్రేమిస్తున్నాడు కృష్ణారావు? వొస్తానని వెళ్ళి కొత్త టిక్కెట్లతో ఇంకో మెట్టు ఎక్కించారు.

కాళ్ళసందడితో ఫిల్ము ప్రారంభమై అమెరికన్ ఫిల్ముల టెక్నిక్‌ని మా మొహాన కొట్టింది. కప్పుదొంతరల కామిక్ చూసి. 'ఇదీరకం' అని జయధ్వానం చేశాడు కృష్ణారావు.

పెదిమల్లోంచి సన్నగా నవ్వాడు బాబు.

"ఛీ, ఛీ," అన్నాను నేను.

శాంతా హుబ్లికర్‌ని దగ్గరగా తెచ్చాడు డైరెక్టరు. మళ్ళీ ఆ సినిమా తీసే సీనువరకూ నేను హాల్లో కూర్చుని ఫిల్మ్ చూస్తున్నానని మరచిపోయినాను. ఇంటర్వెల్ లోకూడా ఆ తెరవంకే చూస్తున్నాను ఆమె యిందాక కనపడ్డస్థలమని. నా పక్క బాబూ కృష్ణారావు చీదరించుకొంటు న్నారు. కథని, మనుషుల్ని, శాంతారాంని తిడుతున్నారు. కాని, కథ ఏమైతేనేం, టెక్నిక్ ఏమైతేనేం, Film ఏమైతేనేం? శాంతాహుబ్లికర్‌ని నాముందు అంతసేపు నుంచోపెట్టిన శాంతారాంని ఎట్లా తిట్టను? దేవుడు చెయ్యని పని చెయ్యగలిగాడు శాంతారాం. నా సంగతి తెలుసునేమో, హుబ్లికర్ లేకండా పట్టుమని నన్నూ, ఫిల్మునీ, రెండు నిమిషాలు వొంట రిగా వుంచలేదు.

*   *   *

ఇంటికి రాగానే సౌరీస్‌తో చెప్పాను ఆద్మీ చూశానని.

"ఎట్లా వుంది?"

"ఫిల్మ్ నేను చూడలేదు. హుబ్లికర్‌నే చూశాను"

"డైరెక్షన్"

"ఆమె గొప్పతనం గొప్పగా తీసుకురావడమే డైరెక్టరు గొప్ప తనం. ఇంకేం కావాలి"

"మన మనుకున్న లోపాలో"

*